సోషియో ఫాంటసీ అడ్వెంచర్ 'విశ్వంభర'

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా 'బింబిసార' ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో సోషియో ఫాంటసీ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. చిరంజీవి నటిస్తున్న 156వ సినిమా ఇది. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'విశ్వంభర' అనే టైటిల్ ప్రచారంలో ఉంది తాజాగా అదే టైటిల్‌ను ఖరారు చేశారు. సోమవారం టైటిల్ ప్రకటనతో పాటు కాన్సెప్ట్ వీడియోను విడుదల చేశారు. విశ్వంభర అంటే విశ్వమును భరించువాడు, పాలించువాడు శ్రీమహావిష్ణువు, విశ్వమంతా తానే ఉన్నవాడు త్రివిక్రమ అవతారంలోని వామనుడు..ఇలా అనేక అర్థాలున్నాయి. కాన్సెప్ట్ వీడియోలో రుద్రాక్ష ఆకారంలో ఉన్న ఒక పెట్టె ఆకాశంపై నుంచి కిందకు రావడం, మధ్యలో ఓ శకలాన్ని ఢీకొట్టి భూమికి చేరుకోవడం, అక్కడొక భారీ హనుమాన్ విగ్రహం దర్శనమివ్వడాన్ని చూపించారు. సోషియో ఫాంటసీ అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. గతంలో చిత్రబృందం చెప్పినట్లుగానే పంచభూతాలు, ముల్లోకాల కాన్సెప్ట్‌కు ఆధ్యాత్మిక అంశాలను జోడించి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు అర్థమవుతున్నది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ మారేడుమిల్లిలో జరుగుతున్నది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఛోటా కె నాయుడు, సంగీతం: యం.యం.కీరవాణి, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, రచన-దర్శకత్వం: వశిష్ట.

అతడే నా సర్వస్వం

బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీతో అగ్ర కథానాయిక రకుల్‌ప్రీత్‌సింగ్ గత కొన్నేళ్లుగా ప్రేమాయణం సాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ జంట ఫిబ్రవరిలో పెళ్లిపీటలెక్కనున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇటీవల కాలంలో ప్రేమికులిద్దరూ కలిసి పలు దేవాలయాల సందర్శన చేస్తున్నారు. ఈ ఫొటోలను జాకీ భగ్నానీ తన సోషల్‌మీడియా ఖాతాల్లో పోస్ట్ చేస్తున్నారు. దీంతో వీరి పెళ్లి వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పెళ్లి వార్తలపై రకుల్‌ప్రీత్ సింగ్ స్పందించింది. 'ప్రతి ఒక్కరూ జీవితంలోని ఏదో ఒక దశలో మనసుకు నచ్చిన వారిని ఎంపిక చేసుకుంటారు. అది చాలా సహజం. నేను ఎన్నో ఏళ్లు ఒంటరి జీవితాన్ని గడిపాను. జాకీ నా జీవితంలోకి ప్రవేశించిన తర్వాత ఎన్నో మార్పులొచ్చాయి. అతనే నా సర్వస్వంగా మారిపోయాడు. ఇద్దరం ఇండస్ట్రీ వ్యక్తులం కావడం వల్ల ఒకరినొకరం బాగా అర్థం చేసుకున్నాం. మా ఇద్దరి అభిరుచులు కూడా ఒకేలా ఉంటాయి. మేమిద్దరం ఫిట్‌నెస్‌ను ఎంతగానో ఇష్టపడతాం. షూటింగ్ బిజీ వల్ల ఇద్దరం కలిసి గడిపే సమయం చాలా తక్కువ. అప్పుడు కేవలం వ్యక్తిగత విషయాలు మాత్రమే మాట్లాడుకుంటాం' అని చెప్పింది.

రకుల్‌ప్రీత్‌సింగ్

రొమాంటిక్ 'రాజా సాబ్'

అగ్ర హీరో ప్రభాస్ ఇప్పటివరకు హారర్ కామెడీ జోనర్‌లో సినిమాలు చేయలేదు. దాంతో మారుతి దర్శకత్వంలో ఆయన నటిస్తున్న తాజా చిత్రం నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. ఈ సినిమాకు 'రాజా సాబ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం టైటిల్‌ను ప్రకటించడంతో పాటు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ప్రభాస్ లుంగీ కట్టుకొని వింటేజ్ లుక్‌లో దర్శనమిస్తున్నారు. దర్శకుడు మారుతి శైలి వినోదం, ప్రభాస్ ఇమేజ్‌కు తగిన యాక్షన్, రొమాంటిక్ హంగులతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. ప్రభాస్ పాత్ర మునుపెన్నడూ చూడని రీతిలో చక్కటి హాస్యం, రొమాన్స్ కలబోతగా ఉంటుందని చెబుతున్నారు. ఈ పాన్ ఇండియా చిత్రం ప్రస్తుతం షూటింగ్‌ను జరుపుకుంటున్నది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కార్తీక్ పళని, సంగీతం: తమన్, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: ఎస్‌కేఎన్, ఫైట్స్: కింగ్ సోలొమన్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, రచన-దర్శకత్వం: మారుతి.

విధిని ఎదురించే వీరుడు

''విధి కాలం కంటే బలమైనది. గతం, వర్తమానం, భవిష్యత్..కాలం ఏదైనా నలుదిక్కులా మార్మోగు పేరు ఒక్కటే 'కంగువ'' అంటున్నారు తమిళ అగ్ర హీరో సూర్య. ఆయన నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'కంగువ' సెకండ్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో ఆయన యుద్ధవీరుడిలా కనిపిస్తున్నారు. ఈ చారిత్రక నేపథ్య చిత్రాన్ని పాన్ వరల్డ్ మూవీగా పది భాషల్లో తెరకెక్కిస్తున్నారు. త్రీడీ వెర్షన్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శివ దర్శకత్వం వహిస్తున్నారు. దిశా పటానీ కథానాయిక. అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, ఎవరికీ తలొంచని ధీరుడిగా సూర్య పాత్ర ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేస్తుందని, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిస్వామి, నిర్మాతలు: కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్, దర్శకత్వం: శివ.

గాయని చిత్ర అయోధ్య వీడియోపై విమర్శలు

ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవం సందర్భంగా ప్రజలందరూ శ్రీరామ నామాన్ని స్మరించాలని, సాయంత్రం వేళ ఇంటి ప్రాంగణాల్లో ఐదు దీపాలను వెలిగించాలని కోరుతూ ప్రముఖ గాయని చిత్ర ఇటీవల ఓ వీడియోను విడుదల చేశారు. గత రెండు రోజులుగా సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారంలో ఉన్న ఈ వీడియోపై నెటిజన్లతో పాటు పలువురు ప్రముఖుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ రాజకీయ పక్షానికి మద్దతుగానే ఆమె ఈ వీడియోను విడుదల చేసిందని అంటున్నారు. ఆమె స్థాయి గాయని రాజకీయాలకు అతీతంగా ఉంటే మంచిదని పలువురు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. గాయకుడు జి.వేణుగోపాల్ మాత్రం చిత్రకు మద్దతుగా నిలిచాడు. భారతీయ పౌరురాలిగా ఆమె భావ ప్రకటన స్వేచ్ఛను ప్రతీ ఒక్కరూ గౌరవించాలని కోరారు. ప్రస్తుతం ఈ వివాదం దక్షిణాదిలో చర్చనీయాంశంగా మారింది.

ఓవర్సీస్‌లో 'హనుమాన్' రికార్డులు

సంక్రాంతి బరిలో ప్రేక్షకుల ముందుకొచ్చిన 'హనుమాన్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోతున్నది. తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం నాలుగు రోజుల్లోనే వందకోట్ల మైలురాయిని దాటింది. ఇక విదేశాల్లో సైతం ఈ సినిమా రికార్డు కలెక్షన్లను రాబడుతున్నది. ఉత్తర అమెరికాలో 3 మిలియన్ల డాలర్ల వసూళ్లను దాటింది. అక్కడ మొదటి వారాంతంలో ఆర్‌ఆర్‌ఆర్, బాహుబలి, సలార్ రికార్డులను దాటేయడం విశేషం. అమెరికాలో లాంగ్‌రన్‌లో ఈ చిత్రం 5 మిలియన్ డాలర్ల వసూళ్లను దాటొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. చిన్న సినిమాగా విడుదలైన ఈ చిత్రం అనూహ్య వసూళ్లతో సంక్రాంతి విజేతగా నిలిచిందని విశ్లేషకులు చెబుతున్నారు. భారతీయ తొలి ఒరిజినల్ సూపర్ హీరో ఫిల్మ్‌గా 'హనుమాన్'కు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. రాబోవు రోజుల్లో ఈ సినిమాకు మరిన్ని థియేటర్లు అందుబాటులోకి రానున్నాయని సమాచారం.

ప్రేమ పయనంలో..

సుమయ రెడ్డి

తెలుగమ్మాయి సుమయ రెడ్డి కథానాయికగా నటిస్తున్న చిత్రం 'డియర్ ఉమ'. ఈ సినిమాకు ఆమె కథనందించడంతో పాటు నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నది. సాయి రాజేష్ మహాదేవ్ దర్శకుడు. పృథ్వీ అంబర్ హీరోగా నటిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైన్ ఇది. ఫ్యామిలీ సెంటిమెంట్, కామెడీ అంశాతో ఆకట్టుకుంటుంది. ప్రేమ ప్రయాణంలో ఓ జంటకు ఎదురైన అందమైన అనుభూతులకు దర్పణంలా ఉంటుంది. అంతర్లీనంగా చక్కటి సందేశాన్నిస్తుంది' అన్నారు. కమల్ కామరాజు, సప్తగిరి, అజయ్‌ఘోష్, ఆమని, రాజీవ్ కనకాల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాజ్ తోట, సంగీతం: రధన్, నిర్మాణ సంస్థ: సుమ చిత్ర ఆర్ట్స్, దర్శకత్వం: సాయిరాజేష్ మహాదేవ్.

ప్రణయ గగనంలో 'పతంగ్'

ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'పతంగ్'. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. సంక్రాంతి సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'పతంగుల పోటీ నేపథ్యంలో రాబోతున్న స్పోర్ట్స్ డ్రామా ఇది. సికింద్రాబాద్ బస్తీలో కథ నడుస్తుంది. సహజత్వానికి దగ్గరగా ఆద్యంతం వినోదం, భావోద్వేగాల ప్రధానంగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. ప్రస్తుతం ఆఖరి షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతున్నది. వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శక్తి అరవింద్, సంగీతం: జోస్ జిమ్మి, నిర్మాతలు: విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి, దర్శకత్వం: ప్రణీత్ ప్రత్తిపాటి.